క్లుప్తంగా

నేడు ఇఫ్తార్ విందు

దూద్‌బౌలి: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఈనెల 27న సాయంత్రం 5 గంటలకు గాయత్రి భవన్‌లో దక్షిణ మండలం పోలీసులు, పీస్ కమిటీ సభ్యులు ఇఫ్తార్ పార్టీని నిర్వహించనున్నట్లు దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య తెలిపారు. ఈ ఇఫ్తార్ విందుకు నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌తో పాటు పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొంటారన్నారు.

సత్యాగ్రహ నిరసన దీక్షలో వెంకటేశ్



గౌలిపురా: రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వంపై అనర్హత వేటును నిరసిస్తూ గాంధీభవన్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సత్యాగ్రహ నిరసన దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వెంకటేశ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిరసన దీక్షకు తరలివెళ్లి దీక్షకు సంఘీభావం తెలిపారు. వెంకటేశ్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం అవినీతిని ఎవరూ ప్రశ్నించినా.. వారిపై ప్రత్యేక్షంగా, పరోక్షంగా దాడులు చేస్తున్నారన్నారు.

ఉగాది పురస్కారాల ప్రదానం



పురస్కార గ్రహీతలతో ఓలేటి పార్వతీశం

గన్‌ఫౌండ్రీ: పురస్కారాలు బాధ్యతను పెంచడంతో పాటు ఇతరులలో స్ఫూర్తిని రగిలిస్తాయని ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో అక్షజ్ఞ పబ్లికేషన్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న మహిళామణులకు ఉగాది పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సాహితీవేత్త అక్కిరాజు సుందర రామకృష్ణ, సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞ శర్మ, రచయిత్రి ముక్తేవి భారతి, పబ్లికేషన్ వ్యవస్థాపకులు విద్యాభార్గవి, సంచాలకులు కళారత్న బ్నిం పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ




పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆనంద్‌సింగ్ లోధ్, పప్పు మాత్రే తదితరులు

అబిడ్స్: శ్రీరామనవమి పాల్కి శోభాయాత్ర పోస్టర్‌ను నిర్వాహకులు ఆనంద్‌సింగ్‌లోధ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈనెల 30న ధూల్‌పేట బడా బంగ్లా నుంచి వేలాది మందితో శ్రీరామనవమి పాల్కి శోభాయాత్ర నిర్వహిస్తారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని పాల్కి శోభాయాత్రను పెద్ద ఎత్తున చేపడుతామని ఆనంద్‌సింగ్ లోధ్ తెలిపారు. ఆదివారం శోభాయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పప్పు మాత్రే, జీవన్ బాటీ, అజయ్ గోయల్, పవన్ శర్మ, రమేష్ బజాజ్, దీపక్ తివారి, రామ్‌చందర్ మహారాజ్, ప్రదీప్‌రాజ్, కోటి శైలేష్ కురుమ, విజయ్‌సింగ్, ప్రశాంత్ సింగ్ పాల్గొన్నారు.

వాసవీక్లబ్ సంక్షేమానికి ప్రత్యేక కృషి

అబిడ్స్: వాసవీక్లబ్ సంక్షేమానికి ప్రత్యేక కృషి చేస్తానని వాసవీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షుడు ఉప్పల వరకుమార్ గుప్తా పేర్కొన్నారు. 2023–2024 సంవత్సరానికి నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన వరకుమార్ గుప్తా మాట్లాడుతూ.. నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతామన్నారు. వాసవీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ రాష్ట్రంలోనే అతి పురాతన సేవాభావం కలిగిన ఎన్‌జీఓ సంస్థ అని ఆయన అన్నారు. 61 ఏళ్లుగా తమ క్లబ్ ఆధ్వర్యంలో పేద బడుగు వర్గాల కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రధాన కార్యదర్శిగా మంచాల అంబరీష్, కోశాధికారిగా అడ్డగుళ్ల వెంకటేష్‌తో పాటు పలువురు ఎంపికయ్యారు. నూతనంగా ఎన్నికైన వారిని ఘనంగా సత్కరించారు.



ఉప్పల వరకుమార్‌గుప్తా తదితరులు

మక్కా మసీదులో రంజాన్ సందడి

- దేశంలోని అతి పెద్ద పురాతన మసీదుల్లో మక్కా మసీదు ఒకటి
- అక్కడి బల్లపై ఒక్కసారి కూర్చుంటే.. సందర్శన కోసం మళ్లీ వస్తారనేది నమ్మకం
- రంజాన్ సందర్భంగా మసీదు నిర్మాణంపై ప్రత్యేక కథనం



చార్మినార్: మక్కా మసీదులో రోజంతా రంజాన్ సందడి నెలకొంది. నగర ప్రజలే కాకుండా ఇతర జిల్లాలు, రాష్ట్రాల ముస్లింలు మక్కా మసీదును సందర్శించి ఇక్కడ జరిగే రంజాన్ ప్రార్థనల్లో పాల్గొంటున్నారు. దీంతో మక్కా మసీదు ప్రాంగణం పూర్తిగా ముస్లిం ప్రజలతో కళకళలాడుతోంది. రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలు రోజంతా కఠోర ఉపవాస దీక్షలు కొనసాగిస్తూ రోజుకు ఐదుసార్లు నమాజ్ చేస్తారు. చాలా మంది సామూహిక ప్రార్థనలను మక్కా మసీదులో నిర్వహించడానికి ఇష్టపడుతారు. అంతేకాకుండా సాయంత్రం ఉపవాస దీక్షల అనంతరం నిర్వహించే ఇఫ్తార్ విందులు కూడా మక్కా మసీదు ప్రాంగణంలో నిర్వహించడానికి ఆసక్తి చూపిస్తారు. దీంతో ప్రతిరోజూ ఉదయం నుంచి రాత్రి తరావీ ప్రార్థనల వరకు మక్కా మసీదు సందడిగా మారుతోంది. మక్కా మసీదులో సామూహిక ప్రార్థనలు చేయడానికి ముస్లింలు ఆసక్తి చూపిస్తుండడంతో ఎక్కడ చూసిన ఆధ్యాత్మిక వాతావరణం కనిపిస్తుంది.

77 ఏళ్ల పాటు ఈ నిర్మాణ పనులు..

- మక్కా మసీదు నిర్మాణం 1617లో ప్రారంభమైంది. దాదాపు 77 ఏళ్ల పాటు ఈ నిర్మాణ పనులు జరిగి 1690 లో పూర్తయ్యాయి.
- మక్కా మసీదు ఎత్తు 176 అడుగులు, మక్కా మసీదు లోపల 67 మీటర్ల పొడవు, 54 మీటర్ల వెడల్పు, 23 మీటర్ల ఎత్తు గల విశాలమైన ప్రార్థనలు హాల్ ఉంది.
- దాదాపు ఒకేసారి 3 వేల మంది ఈ హాల్‌లో ప్రార్థనలు చేసుకోవడానికి అవకాశాన్ని కల్పించారు.
- మసీదుకు దక్షిణంలో ఐదుగురు ఆసఫ్‌జాహి రాజులు, వారి కుటుంబ సభ్యుల సమాధులు 15 ఉన్నాయి.

దేశంలో అతి పెద్ద పురాతన మసీదు..

- దేశంలో గల అతి పెద్ద పురాతన మసీదులో మక్కా మసీదు ఒకటి.
- చారిత్రాత్మకమైన చార్మినార్ కట్టడానికి అతి సమీపంలో దక్షిణం వైపున సుమారు 100 గజాల దూరంలో మక్కా మసీదు ఉంది.
- మహ్మద్ ప్రవక్త మక్కాలో నిర్మించిన మసీదు నుంచి కొన్ని రాళ్లు తీసుకొచ్చి ఇక్కడి మసీదు నిర్మాణ సమయంలో ఉపయోగించారని.. అందుకే ఈ మసీదుకు మక్కా మసీదని పేరొచ్చిందని చరిత్రకారుల అభిప్రాయం.
- మక్కా మసీదులోని ఆవరణలో ఎడమ వైపు ఉన్న బల్లపై ఒకసారి కూర్చుంటే మక్కా మసీదు సందర్శన కోసం మళ్లీ వస్తారనేది నమ్మకం.

మక్కా మసీదు నిర్మాణంలో ఎక్కడా మట్టిని వాడలేదు..

- మసీదు నిర్మాణంలో ఎక్కడా మట్టిని వాడలేదు. రాళ్ల పొడిని మాత్రమే ఉపయోగించారు.
- మక్కా మసీదు నిర్మాణానికి ఉపయోగించిన రాళ్లను మహబూబ్‌నగర్ జిల్లా షాద్‌నగర్ సమీపంలోని ఓ పెద్ద రాతి కొండను ఎంపిక చేశారు.
- కొండను తొలిచి ఎత్తైన రాళ్లతో మక్కా మసీదు నిర్మాణం జరిగింది. ఆ రాళ్లను ఎడ్ల బండ్ల ద్వారా మక్కా మసీదుకు తీసుకొచ్చారు.

కొనసాగుతున్న వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు



ఊరేగింపులో ముత్యాల శేఖర్‌బాబు తదితరులు



గరుడ వాహనంపై వేంకటేశ్వర స్వామి

లంగర్‌హౌస్: జానకీసమేత వీరవెంకట విజయరాఘవ స్వామి ఆలయంలో వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో వేదపండితులు రాజనర్సిహచారి, శ్రీనివాస్‌చారి శనివారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణం నిర్వహించారు. ఇంద్ర, నర్సిహారెడ్డి దంపతులతో పాటు డాక్టర్ విజయమ్మ, రవి అమ్మవారు, స్వామి వార్లకు పట్టువస్త్రాలు సమర్పించి తలంబ్రాలు పోశారు. అనంతరం గరుడ వాహనంపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామితో పాటు పల్లకిలో కల్యాణ భూదేవి, శ్రీదేవి సమేత శ్రీనివాసుడిని లంగర్‌హౌస్ పుర వీధుల్లో ఊరేగించనున్నారు.

ఉత్సవాల్లో నేడు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నృషింహ శతకం, ఆలయంలో కొలువుదీరిన పానకాల యోగానృసింహ స్వామికి ప్రత్యేక పంచామృతాభిషేకాలు నిర్వహిస్తారు. రాత్రి 7 గంటలకు లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం నిర్వహించి అనంతరం కల్యాణ లక్ష్మీనరసింహ స్వామితో పాటు యోగా నరసింహ స్వామి అలంకరణలో దర్శనమిచ్చే స్వామి వారిని లంగర్‌హౌస్ వీధుల్లో ఊరేగించనున్నారు. ఈ ఉత్సవాల్లో సాయిటెక్ ముత్యాల శేఖర్ బాబు, గోవింద్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

28, 29 తేదీల్లో ఆర్థిక సంస్కరణలపై జాతీయ సదస్సు

సుల్తాన్‌బజార్: తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయంలోని ఆర్థిక శాస్త్ర విభాగం, బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో 30 ఏళ్ల ఆర్థిక సంస్కరణలు, సవాళ్లతో కూడిన భారతదేశ రూపాంతకరణ అనే అంశంపై రెండురోజుల జాతీయ సదస్సును ఈనెల 28, 29 తేదీల్లో కోఠి మహిళా విశ్వవిద్యాలయం పీజీ బ్లాక్ సెమినార్ హాల్‌లో నిర్వహించనున్నట్లు సదస్సు విభాగాధిపతి డాక్టర్ కేబీ.రత్న కుమారి తెలిపారు. రెండురోజుల పాటు జరిగే ఈ జాతీయ సదస్సుకు బీజే ఆర్ డిగ్రీ ప్రభుత్వ కళాశాల విభాగాధిపతి డాక్టర్ మునిస్వామి కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారని తెలిపారు. అలాగే విశ్వ విద్యాలయం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వరిజరాణి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ.గీతాలక్ష్మి పట్నాయక్ పాల్గొంటారని తెలిపారు. అలాగే విశ్వ విద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ విజ్జులత, తెలంగాణ ఉన్నత విద్యాసంస్థ మండలి చైర్మన్ ఆర్. లింబాద్రి, మహాత్మాగాంధీ నేషనల్ కౌన్సిల్ ఫర్ రూరల్ ఎడ్యుకేషన్ చైర్మన్, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా డాక్టర్ డబ్ల్యూజీ ప్రసన్న కుమారీలు ఈ సదస్సులో ప్రసంగిస్తారని తెలిపారు.

30 నుంచి శ్రీరామ సప్తాహ మహోత్సవాలు

జియాగూడ: జియాగూడ సమర్థ నారాయణ ఆశ్రమంలో ఈనెల 30 నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు శ్రీరామ సప్తాహ మహోత్సవాలు సద్గురు సమర్థ రామదాస స్వామి గురు సాంప్రదాయంలో 12వ పీఠాధిపతులైన ప్రభుదత్త మహారాజ్ ఆధ్వర్యంలో జరుగుతాయి. 30న సీతారామ కల్యాణ మహోత్సవం, శ్రీరామ తారక హోమం, మంగళహారతి, 31న గజలక్ష్మి మాతకు మహాపూజ, సూక్త పూర్వక లక్ష్మీనారాయణ హోమం, ఏప్రిల్ 1న శ్రీపవమాన హోమం, మంగళహారతి, 2న సహస్ర మోదక గణపతి హోమం, ఆదిత్యాది నవగ్రహ దేవతా హోమం, 3, 4న శ్రీరామ తారక హోమం, 108 హనుమాన్ చాలీసా పఠనంలు, 5న కామధేను పూజ, గోపూజ, గోగ్రాస సేవా, నవ ఛండికా హోమం, కొమారిక పూజ వాయినం, 6న కల్పవృక్షమారుతి, అమరేశ్వరస్వామికి కుంభాభిషేకం, హనుమాన్ జయంతి, సీతారామస్వామి ప్రతోత్సవం, ఊరేగింపు, మహా అన్నదాన కార్యక్రమం మొదలైనవి ఉంటాయి.

సెక్యులర్ విధానాలకు మజ్లిస్ కట్టుబడి ఉంటుంది



ఎమ్మెల్యే తో రాజు వస్తాద్

గోల్కొండ: మజ్లిస్ సెక్యులర్ విధానాలకు కట్టుబడి ఉంటుందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఆదివారం ప్రముఖ సంఘసేవకుడు ఎస్. రాజు వస్తాద్ ఎమ్మెల్యేను టోలిచౌకి మేరాజ్ కాలనీలోని ఆయన కార్యాలయంలో కలిశాడు. ఈ సందర్భంగా ఆయన ఇబ్రహీంబాగ్‌లో అన్ని రకాల అభివృద్ధి పనులు చేయించినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి అన్ని ప్రాంతాల్లో పార్టీలు, వర్గాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేయించారు. ఇబ్రహీంబాగ్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతమని, దీని పరిసరాల్లో బహుళ అంతస్తుల భవనాలు కూడా నిలుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో హబీబ్ చావూస్, అలీమొద్దీన్ తదితరులున్నారు.

కేంద్ర ప్రభుత్వం బీసీ కుల గణన చేయాలి



మాట్లాడుతున్న రాజేశ్వర్ యాదవ్

చార్మినార్: కేంద్ర ప్రభుత్వం బీసీ కుల గణన చేయకుండా నాన్చుతూ దేశ జనాభాలో 56 శాతం ఉన్న బీసీ మనోభావాలను దెబ్బతీస్తుందని రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు ఎ.రాజేశ్వర్‌యాదవ్ అన్నారు. రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్‌యాదవ్ ఆధ్వర్యంలో బీసీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు విన్నవించినా.. ఉద్యమాలు చేసినా.. బీసీల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తుందన్నారు. ఈ పార్లమెంటు సమావేశాల్లో అసెంబ్లీ, పార్లమెంట్లో 50 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెట్టాలని.. ప్రైవేటు సెక్టార్లలో ఓబీసీలకు రిజర్వేషన్లు పెట్టాలని.. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషను కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ నాయకులు ఎం.కుమార్, పూసల సత్యనారాయణ, జగదీష్ గౌడ్, దిలీప్ ముదిరాజ్, సాయిబాబా, రాహుల్, శివ పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు



చాంద్రాయణగుట్ట: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని బార్కాస్ డివిజన్‌లో కార్పొరేటర్ షభానా హఫీజ్ పటేల్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఫహద్ బిన్ అబ్దాద్, సలీం బేగ్, ఆజంషరీఫ్, ఎం.ఎ.రహెమాన్, మాజీ కార్పొరేటర్ సమద్ బిన్ అబ్దాద్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫేర్‌వెల్ డే



గోల్కొండ: 10వ తరగతి రోజులు విద్యార్థుల జీవితాల్లో మధురమైన ఘట్టమని రవీంద్రభారతి పాఠశాలల మెహిదీపట్నం జోన్ డీన్ ప్రియామనీష్ అన్నారు. ఆదివారం మెహిదీపట్నం మురాద్‌నగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ డే వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. ఆమె ముఖ్యఅతిథిగా హాజరై 10వ తరగతిలో వివిధ విభాగాల్లో ఉత్తమ విద్యార్థులుగా ఎంపికైన వారికి బ్యాడ్జీలు అందజేశారు. ప్రిన్సిపాల్ రాజేశ్వరి, అకాడమిక్ ఇన్‌చార్జ్ నస్రీన్ ఫాతిమా, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టోపీలు, అత్తర్, సుర్మా అందజేత



చార్మినార్: రంజాన్ మాసంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని దక్షిణ మండలం ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్‌రావు తెలిపారు. ఆదివారం రాత్రి మక్కా మసీదులో తరావీ ప్రార్థనలకు వచ్చిన ముస్లింలకు చార్మినార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవితో కలిసి టోపీలు, అత్తర్, సుర్మాను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో నగరంలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా మక్కా మసీదులో రాత్రిపూట జరిగే తరావీ ప్రార్థనలకు ముస్లింలు అధిక సంఖ్యలో వస్తుంటారని.. వీరి సౌకర్యార్థం తగిన ఏర్పాట్లు చేశామన్నారు.

తరావీ ప్రార్థనలు

గోల్కొండ: రంజాన్ మాసంలో తరావీ ప్రార్థనలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ప్రతి ఒక్క ముస్లిం ఈ తరావీ ప్రార్థనల్లో పాల్గొంటారు. ప్రార్థనలకు నేతృత్వం వహించే ఇమామ్ దివ్య ఖురాన్ గ్రంథ పఠనాన్ని పఠిస్తాడు. ఈ విధంగా తరావీ ప్రార్థనల్లో రంజాన్ నెలలో దివ్య ఖురాన్ గ్రంథాన్ని పఠించడం ఒకసారి పూర్తవుతుంది. అహ్మద్‌నగర్, మెహిదీపట్నం, గోల్కొండ తదితర ప్రాంతాల్లోని ప్రధాన మసీదులు ప్రార్థనలు కొనసాగుతున్నాయి. ఎమ్మెల్యే కౌసర్ హకీంపేట్ దర్గాలో ఆరు రోజుల్లో పూర్తయ్యే తరావీ ప్రార్థనలు చేయిస్తున్నారు.



అంబేడ్కర్ ఆశయ సాధనకు తెలంగాణ ప్రభుత్వం కృషి



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్

సుల్తాన్‌బజార్: అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని గౌలిగూడలో ప్రభుమిత్ర సేవక్ సమాజ్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం మంత్రి తలసాని ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్‌కు ప్రపంచ దేశాలలో ఎంతో గౌరవం ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం అంబేడ్కర్ ఆశయ సాధనలో ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శంకర్‌యాదవ్, ప్రేమ్‌సింగ్ రాథోడ్, మమతాగుప్తా, కిషన్‌యాదవ్, గడ్డం శ్రీనివాస్‌యాదవ్, శీలం సరస్వతి పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి: మంత్రి తలసాని



మంత్రి తలసానిని సన్మానిస్తున్న జాగరణ్ మండల్ సభ్యులు

గన్‌ఫౌండ్రీ: చైత్ర నవరాత్రులు మానవాళికి శ్రేయస్కరమని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం గోషామహల్ పోలీస్ స్టేడియంలో మా వైష్ణవ దేవి జాగరణ మండల్ ఆధ్వర్యంలో వైష్ణవ దేవీ విశాల్ జాగరణ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. మానవాళి శ్రేయస్సు కోసం దేవీ నవరాత్రులను నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం అమ్మవారి భక్తి భజన పాటలతో మారుమ్రోగింది. అదేవిధంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ లోధా, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, మండల్ అధ్యక్షుడు అంజనీకుమార్ అగర్వాల్, సభ్యులు రామ్‌కిషన్ అగర్వాల్, సంజయ్ అగర్వాల్ పాల్గొన్నారు.

వైభవంగా మహంకాళేశ్వర ఆలయ వార్షికోత్సవం



మహా పూర్ణాహుతిలో గాజుల అంజయ్య, కాట రమేష్ దంపతులు

చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ ఏడవ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు గాజుల అంజయ్య ఆధ్వర్యంలో దేవాలయ వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. ఉదయం దీపారాధన, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, మాతృక పూజనం, నాంది, ఆచార్య ఋత్విక్‌వర్ణం, రక్షాబంధనం తదితర కార్యక్రమాలు జరిగాయి. ఉదయం 8 గంటల నుంచి బ్రహ్మాదిమండల స్థాపనం, నవగ్రహ దేవత స్థాపన పూజ, లక్ష్మీస్థాపనం, రుద్రపీఠ స్థాపనం, ఆంజనేయ సుబ్రమణ్య స్థాపనం తదితర కార్యక్రమాలు కొనసాగాయి. అగ్ని ప్రతిష్ట, రుద్ర హోమం, చండీహోమం, మణ్యుసుక్త హోమం, సర్ప సుక్త హోమం, నవగ్రహం హోమం, మహా కుంభాభిషేకం, పూర్ణాహుతి తదితర పూజ కార్యక్రమాలు జరిగాయి. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ హోమం, పూర్ణాహుతి పూజా కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు కాట రమేష్ దంపతులతో కోటిరెడ్డి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చలో ఢిల్లీ నిరసనను విజయవంతం చేయాలి



ఆశలతకు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

జియాగూడ: ఏప్రిల్ 5న రైతు కార్మిక సంఘాలు చేపట్టిన చలో ఢిల్లీ నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ ఐద్వా ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ సందర్భంగా జియాగూడలోని భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి పాదయాత్ర చేపట్టారు. జియాగూడ డంపింగ్ యార్డు, మేకలమండి ఆధునీకరణ సమస్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు శశికళ, శ్రావణ్, ఆశాలత, విఠల్, నాగేశ్వర్, చుక్కా నర్సింహ మాట్లాడుతూ.. నిత్యావసర పెట్రోల్, గ్యాస్ సిలిండర్ ధరలు అధికంగా పెరగడానికి కారణమైన బీజేపీ ప్రభుత్వాన్ని నిలదీయడం కోసం తరలిరావాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రజా సంఘాల నాయకులు అబ్దుల్ సత్తార్ ఐద్వా నాయకులు లావణ్య, సునీత, శంకరమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆఫ్రికన్ చీతా మృతి


బహదూర్‌పురా: జూ పార్కులో ఆఫ్రికన్ చీతా గుండెపోటుతో మృతి చెందింది. శుక్రవారం సాయంత్రం అస్వస్థతకు గురైన చీతా గుండెపోటుకు గురై రాత్రి వేళలో మృతి చెందింది. 2012లో నెహ్రూ జూలాజికల్ పార్కులో క్రాప్–11 జాతీయ సమ్మిట్‌కు హాజరైన సౌదీ అరేబియా ప్రిన్సెస్ బాదర్బన్ అల్ సౌండ్ మహ్మద్ విశాలమైన జూ నిర్వహణ హుషారుగా ఉన్న వన్యప్రాణులను చూసి జూ అధికారులను ప్రశంసిస్తూ ఆఫ్రికన్ సింహాలు, చీతాలను జూ పార్కుకు బహుమతిగా ఇచ్చారు. 13 ఏళ్ల వ్యవధిలో చీతాలు వరుసగా మృతి చెందాయి. తాజాగా శుక్రవారం రాత్రి అబ్దుల్లా అనే చీతా కూడా మృతి చెందడంతో జూలో అరుదైన ఆఫ్రికన్ చీతాలు పూర్తిగా లేకుండా పోయాయి. ఆఫ్రికన్ చీతా మృతితో జూపార్కులో ఇక ఆఫ్రికన్ చీతాలు చూసేందుకు లేకుండా పోయాయి. జూ పార్కులో వన్యప్రాణులు మృతి చెందకుండా తీసుకుంటున్న చర్యలు కూడా ఫలించకపోవడంతో వన్యప్రాణులు వరుసగా మృత్యువాత పడుతున్నాయి. అరుదైన ఆఫ్రికన్ చీతా మృతికి తీవ్రమైన గుండెపోటు కారణమని.. పోస్టుమార్టం ప్రాథమిక నివేదికలో కూడా తేలిసిందని జూపార్కు వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ ఎం.ఎ.హకీం తెలిపారు.



పోస్టుమార్టం నివేదిక

బహదూర్‌పురా: ఆఫ్రికన్ చీతా గుండెపోటుతో మృతి చెందినట్లుగా పోస్టుమార్టం నివేదికలు తేల్చాయి. 2020–21లో కరోనా వ్యాక్సిన్లతో ప్రాణాలను మనుషులు కాపాడుకున్నారు. కరోనా రాకుండా వేసుకున్న వ్యాక్సిన్ల కారణంగా ఈ సంవత్సరం నుంచి గుండెపోటుకు గురై మృతి చెందుతున్నట్లుగా ఇటీవల కొందరు ప్రముఖ డాక్టర్లు పేర్కొన్నారు. కరోనా సమయంలో జూలోని 9 వన్యప్రాణులకు కూడా కరోనా సోకింది. కరోనా నుంచి మనుషులు కోలుకుంటున్నట్లుగానే.. వన్యప్రాణులు కూడా కోలుకోనే గుండెపోటుతో చనిపోతున్నాయా? అన్నది తెలియాల్సి ఉన్నది. గతంలో జూ చుట్టూ పెద్ద ఎత్తున కర్మాగారాలు ఉండటంతో ఎన్నో వన్యప్రాణుల కాలేయాలు రంగు మారిపోయి చిన్నగా నల్లగా మారి ఇబ్బందికి గురై మృతి చెందాయి. జూలో మృతి చెందిన అబ్దుల్లా (13) అరుదైన ఆఫ్రికన్ చీతా. జూకు వచ్చిన నాలుగు బహుమతిగా వచ్చిన అరుదైన చీతాలు కూడా మృత్యువాత పడ్డాయి. వన్యప్రాణులు కూడా కరోనా తరువాత మనుషుల్లాగా గుండెపోటుతో మృతి చెందుతున్నాయనే దాని జూ వెటర్నరీ అధికారులు ఏమి చెప్పలేకపోతున్నారు.

'రాహుల్‌గాంధీ పార్లమెంటు సభ్యత్వ రద్దు అప్రజాస్వామికం'



కార్యక్రమంలో నిర్మల్‌కుమార్ యాదవ్ తదితరులు

అబిడ్స్: కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయడం అప్రజాస్వామికమని రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నిర్మల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. గాంధీభవన్ వద్ద కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సత్యాగ్రహ కార్యక్రమానికి గోషామహల్ నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలతో తరలి వెళ్లి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్మల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. బీజేపీ ప్రజాస్వామ్యాన్ని కూనీ చేసిందన్నారు. బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్‌ను ఎన్ని వేధింపులకు గురిచేసినా తాము భయపడేది లేదన్నారు. అన్నివర్గాల ప్రజల అండదండాలు రాహుల్‌గాంధీ వైపే ఉన్నాయన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉర్సు



అబిడ్స్: హజ్రత్ సర్దార్‌బేగ్ 101వ ఉర్సు మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బోయిగూడ కమాన్‌లో దర్గాలో ఆదివారం ఉర్సు మహోత్సవాలు చేపట్టారు. సర్దార్ సందల్ మాలీ, ముషాహిరా వేడుకలు ఆదివారం రాత్రి పెద్ద ఎత్తున చేపట్టారు. నగరవాసులే కాక మహబూబ్‌నగర్, రంగారెడ్డి, గుల్బర్గా, ఇతర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని పూజలు ప్రార్థనలు చేశారు. దర్గా నిర్వాహకులు నిజాం బాబా హారోని ఈ ఉర్సు ఉత్సవాలు ప్రారంభించారు. నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ ఉపాధ్యక్షులు మెట్టు వెంకటేష్, పలువురు నాయకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉర్సులో పాల్గొన్న వందలాది మందికి భోజన వసతులు కల్పించారు.